రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త


వివరాలు వెల్లడిస్తున్న ఏసిపి శ్రీకాంత్ గౌడ్

## లోపాలను ప్రశ్నించిన కస్టమర్లపై బెదిరింపులు, ట్రోలింగ్..
### కేటరింగ్ నిర్వాహకుడి అరెస్ట్

**శంషాబాద్, జులై 28,ప్రభాతవార్త :** కేటరింగ్ సేవల్లో లోపాలను ప్రశ్నించిన కస్టమర్లపై బెదిరింపులకు దిగుతూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్న ఒక కేటరింగ్ వ్యాపారిని శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, సీఐ సంజీవులు, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ పవన్ కుమార్‌లతో కలిసి ఈ వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలానికి చెందిన వన్నూరు స్వామి ముదిరాజ్ (34) మాసాబ్ ట్యాంక్ పరిధిలో నివాసముంటూ కేటరింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 2022 నుండి జస్ట్ డయల్ వేదికగా కేటరింగ్ బాయ్స్‌ను సప్లై చేస్తానంటూ ప్రకటనలు ఇచ్చి కస్టమర్ల నుండి ఆర్డర్లు తీసుకునేవాడు. అయితే ఇతను పంపే కేటరింగ్ బాయ్స్ సమయానికి రాకపోవడం, డ్రెస్సింగ్ సరిగ్గా లేకపోవడం, బాధ్యతారహితంగా ప్రవర్తించడంతో విసుగుచెందిన కస్టమర్లు పూర్తి పేమెంట్లు నిలిపివేయడం లేదా సగం డబ్బులే చెల్లించడం చేసేవారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు వన్నూరు స్వామి, సదరు కస్టమర్లకు రోజుకు దాదాపు 100 ఫోన్ కాల్స్ చేసి తీవ్రంగా బెదిరించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించేవాడు. అంతేకాకుండా, వారిని అవమానించే ఉద్దేశంతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కస్టమర్లకు వ్యతిరేకంగా అభ్యంతరకర పోస్టులు, ట్రోల్స్ పెట్టేవాడు.

నిందితుడి వేధింపులు తాళలేక పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో వివిధ పోలీస్ స్టేషన్లలో ఇతనిపై 20కి పైగా కేసులు నమోదయ్యాయి. జూన్ 11న కులం పేరుతో దూషించాడంటూ వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన ఆర్జీఐఏ పోలీసులు, దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి మోటోరోలా, ఇన్ఫినిక్స్, నోకియా కీప్యాడ్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# నరకపాలక సంస్థ!


అన్నోజీగూడ-ఘనాపూర్ రోడ్డు దుస్థితి

2లో

- అధికారులు హైదరాబాద్‌లో మకాం
- ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడు కరువు
- ఏ రోడ్డు చూసినా గుంతల మయమే..
- ప్రజాప్రతినిధులు లేక పడకేసిన పాలన



# ఎకో టౌన్‌తో బర్డ్ స్ట్రైక్ గండం?



- వ్యర్థాలతో పెరగనున్న పక్షుల సంచారం
- విమాన ఇంజిన్లకు ముప్పు పెరిగే అవకాశం
- సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌పై పెరిగిన నిరసనలు..
- విమానయాన శాఖ జోక్యానికి డిమాండ్
- సాంకేతిక అధ్యయనం జరిపించాలని స్థానికుల విజ్ఞప్తి

**షాద్‌నగర్, జులై 27, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ డెంపింగ్ యార్డ్ ప్రాజెక్టు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఇన్నాళ్లూ పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం, ప్రజారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు, ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయ భద్రతపై కూడా తీవ్ర ముప్పు పొంచి ఉందంటూ గళమెత్తుతున్నారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఈ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

విమానాశ్రయం సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతే ఆహారం కోసం పక్షులు, ఇతర జంతువులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే అత్యంత కీలక సమయంలో పక్షులు విమానాలను ఢీకొట్టే ప్రమాదం (బర్డ్ స్ట్రైక్) గణనీయంగా పెరుగుతుంది.

పక్షులు విమానం ఇంజిన్లలోకి చేరడం లేదా కీలక భాగాలను ఢీకొట్టడం వల్ల తీవ్ర విమాన ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పొగ, మంటలతో తగ్గనున్న విజిబిలిటీ**

డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల తరచూ మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. దీనివల్ల భారీగా పొగ వెలువడి పరిసర ప్రాంతాల్లో తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతుంది.

విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగ అలముకోవడం వల్ల దృశ్యమానత (విజిబిలిటీ) క్షీ ణించి విమానాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతుంది.

**శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని డిమాండ్**

సిద్ధాపూర్ ప్రాజెక్టు వల్ల విమానాశ్రయానికి ఎంత దూరం ఉంది? పక్షుల సంచారం ఎంతమేరకు పెరుగుతుంది? విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? అనే అంశాలపై తక్షణమే సాంకేతిక, శాస్త్రీయ అధ్యయనం నిర్వహించాలని స్థానికులు, ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

**కేంద్ర విమానయాన శాఖ స్పందించాలి**

ఈ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. విమానాశ్రయ భద్రతా నిబంధనలు, మార్గదర్శకాలను సక్రమంగా పాటిస్తున్నారా లేదా అనేది సమీక్షి ంచాలని కోరుతున్నారు. అదేవిధంగా, స్థానిక మరియు రాష్ట్ర బిజెపి నాయకులు ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విమానయాన భద్రతపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి

## సర్‌లో షాద్‌నగర్ పూర్
### 11,881 మంది పెండింగ్

**షాద్‌నగర్, జులై 28, ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. జూలై 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు అందిన ఏఈఆర్ఓల వారీ నివేదిక ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,44,426 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,03,992 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయి. దీంతో మొత్తం 83.46 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. నివేదిక ప్రకారం కొత్తూరు మండలంలో 88.03 శాతం, నందిగామలో 86.45 శాతం, కొందుర్గ్‌లో 91.13 శాతం, జిల్లేడ్ చౌదరిగూడలో 89.67 శాతం, కేశంపేటలో 90.04 శాతం, ఫరూక్‌నగర్ రూరల్‌లో 88.11 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మాత్రం 64.39 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు నివేదికలో వెల్లడైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 2,26,062 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ పూర్తికాగా, మొత్తం 92.49 శాతం ప్రక్రియ పూర్తయింది. ఇంకా 18,364 మంది ఓటర్లకు సంబంధించిన డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు నివేదిక స్పష్టం చేస్తోంది. అత్యధికంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 11,881 మంది, ఫరూక్‌నగర్ రూరల్‌లో 2,294 మంది, నందిగామలో 1,802 మంది, కొత్తూరులో 1,146 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఓటర్ల వివరాల మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సికింద్రాబాద్ (జెబిసి)-శామీర్‌పేట ఎలివేటేడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ, నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పనులు కూడ పూర్తి కావస్తున్నాయి. ఇప్పటి వరకు మూడు గ్రామాలకు సంబంధించి ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయిన వారికి నష్ట పరిహారంగ సుమారు 700కోట్ల రూపాయల వరకు ప్రభుత్వం చెల్లింపులు చేపట్టింది. ముందుగా



## అల్వాల్ మినహా అందరికీ పరిహారం
### ఎలివెటేడ్ కారిడార్ నిర్వాసితులకు రూ.700 కోట్లు ఇచ్చాం
### జిల్లా భూసేకరణ అధికారి మాలతి

తూంకుంట గ్రామంలో రాజీవ్ రహదారిన రోడ్డుకు ఇరువైపుల ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంకై వెడల్పునకు భవనాలు, షాపుల గదుల కూల్చివేతలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం ఈ విషయంపై మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ), జిల్లా భూసేకరణ అధికారి మాలతి తన ఛాంబర్‌లో కలిసిన విలేకరులతో మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని పోతాయిపల్లి, తూంకుంట, హకీంపేట్, అల్వాల్, లోతుకుంట గ్రామాల్లో (ప్రాంతాల్లో) రాజీవ్ రహదారిన సికింద్రాబాద్ (జెబిఎస్)-శామీర్‌పేట వరకు ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణంను ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. పోతాయిపల్లి, తూంకుంట, లోతుకుంట వాసులకు భూములు, స్థలాలు కోల్పోతున్న వారికి సుమారు 700కోట్ల రూపాయల వరకు నష్టపరిహారంగా చెల్లింపులు బాధితులకు అందజేసినట్లు తెలిపారు. అయితే పోతాయిపల్లి గ్రామ పరిధిలో ముగ్గురికి సుమారు 6కోట్ల రూపాయలు అందజేసి నట్లు తెలిపారు. తూంకుంటలో సుమారు 270మందికి సుమారు 648కోట్ల రూపాయలు చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. లోతుకుంట వాసులు సుమారు 45మందికి సుమారు 46కోట్ల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. ఇక హకీంపేట్‌లో మాత్రం ఎయిర్‌పోర్సు, డిఫెన్స్ భూములు ఉన్నందున భూముల సేకరణ మామూలుగా జరిగినట్లు తెలిపారు. ఇక అల్వాల్‌లో మాత్రం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అల్వాల్ వాసులకు కూడ నష్ట పరిహారం చెల్లించటం జరుగుతుందన్నారు. భూసేకరణ పూర్తి చేసి నష్టపరిహారం అందుకున్న వారి భూములను హెచ్ఎండిఏకు అప్పగించినట్లు డిఆర్ఓ, జిల్లా భూసేకరణ అధికారి మాలతి తెలిపారు.

# సాకులు చెప్పొద్దు

- పనుల వేగం పెరగాల్సిందే
- అవసరమైతే కార్మికుల సంఖ్యను పెంచుకోండి
- ఆగస్టు 15 నాటికి స్పష్టమైన పురోగతి కనిపించాలి
- ఎడ్యుకేషన్ హబ్ కాంట్రాక్టర్లకు కలెక్టర్ హెచ్చరిక

**కొడంగల్/దుద్యాల,జులై 28 ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి (కలెక్టర్) దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం దుద్యాల మండలంలోని హకీంపేట్, దుద్యాల విద్యా కేంద్రం ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్ నిర్మాణ ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా కేంద్రంలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, తాగునీరు, విద్యుత్ సరఫరా, రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ, రక్షణ గోడ అభివృద్ధి తదితర పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘంగా సమీక్షి ంచారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాల, వైద్య కళాశాల, బాలబాలికల వసతి గృహాలు, డిగ్రీ కళాశాల, సమగ్ర పాఠశాలల నిర్మాణ పనులకు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు అదనపు కార్మికులను ఏర్పాటు చేసుకో వాలని సూచించారు. రాబోయే ఆగస్టు పదిహేనవ తేదీ నాటికి నిర్మాణ పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలని తేల్చి చెప్పారు. సాకులు చెప్పి జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. అనంతరం నర్సింగ్ వసతి గృహం, అనుబంధ వైద్య, భౌతిక చికిత్స కళాశాలలు, సమగ్ర పాఠశాలలు, పశువైద్య కళాశాలల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పాలనాధికారి ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**గుడిసెల నివాసితులకు ఇళ్ల మంజూరు**

సమగ్ర పరిశీలనకు ఉత్తర్వులువిద్యా కేంద్రం పనుల సమీక్ష అనంతరం కొడంగల్ ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయంలో బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల, కొడంగల్ పురపాలక సంఘ పరిధిలో గుడిసెలలో నివసిస్తున్న పేద కుటుంబాల గుర్తింపుపై పాలనాధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

గుడిసెలలో నివసిస్తున్న అర్హులైన ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, నిష్పాక్షి కంగా సమగ్ర ప్రజా గణన (సర్వే) నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ, వార్డు స్థాయి అధికారుల సమన్వ యంతో లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలను సిద్ధం చేయాలని, ఏ ఒక్క అర్హత ఉన్న పేద కుటుంబం కూడా విడుదలయ్యే జాబితాలో మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. కొడంగల్‌లో నిర్మాణంలో ఉన్న రెండు పడకల ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, వాటిని త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు ఇళ్ల మంజూరు నివేదికలను ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ పాలనాధికారి సచిన్ బస్వరాజ్ గుప్తురు, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వ హణాధికారి సుధీర్, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, గృహ నిర్మాణ అధికారిణి మణిక్యంబాల, పురపాలక సంఘ అధికారి బలరాం నాయక్, మండల అభివృద్ధి అధికారులు మరియు సంబంధిత సాంకేతిక నిపుణులు, అధికారులు పాల్గొన్నారు


వర్షం ధాటికి గోదారులైన రహదారులు

## దంచేసిన వర్షం

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్ స్తంభించింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదా రులన్నీ జలమయమయ్యాయి.

జూబ్లీహిల్స్, బంజా రాహిల్స్, గచ్చిబౌలి, ఫిల్మ్ నగర్, కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి, నిజాం పేట, బాలనగర్, ఖైరతా బాద్, లక్డీకాపూ ల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సు ఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయ త్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణి కొండ, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, అల్వాల్, ఉప్పల్, ఓల్డ్ సిటీ, హిమా యత్‌నగర్, ముషీరాబాద్ తదితర రహదా రులు జలదిగ్బంధమయ్యాయి.

### 14 మందిని కుక్క కరిస్తే
# కొడంగల్‌లో వైద్యానికి దిక్కులేదు

### బాధితుల్ని తాండూర్ పంపాల్సి వచ్చింది
### ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆవేదన

**కొడంగల్, జులై 28 ప్రభాతవార్త:** కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడతున్నారని, గత రెండు రోజుల క్రితం 14 మందికి కక్క కరిస్తే తాండూర్ పంపించాల్సి వచ్చిందని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం నిర్వహించిన కొడంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి వీలున్నంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**ఇక్కడి వచ్చేది పేదలే ఎక్కువ..పెద్ద మనసుతో పనిచేయండి:కలెక్టర్ హితవు**

దీనిపై సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ దీపక్ తివారి స్పందిస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే వైద్య అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అధికంగా వచ్చేది



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

పేదప్రజలేనని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య అధికారులు పనిచేయాలని సూచించారు. మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యత అయితే మంచి చికిత్స అందించడం వైద్యుల బాధ్యత అని ఆయన అన్నారు. పాముకాటుకు మందులు అందుబాటులో ఉంచాలని, మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ పోకుండా మన ఆసుపత్రిలోనే వైద్య సేవలు అందే విధంగా చూడాలని అధికారులు సూచించారు. తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల వరకూ మెడికల్ కళాశాల తాండూర్‌లోనే కొనసాగుతుందని స్పష్టంచేశారు. కొడంగల్‌లో ప్రస్తుతం ఉన్న సామాగ్రిని తాండూర్‌కు తరలించాలని కొడంగల్ ఆసుపత్రికి అన్ని కొత్త పరికరాలు వస్తున్నాయని తెలిపారు.

**మూడు నెలలుగా నిధులు రావటంలేదు : వైద్యుల వివరణ**

తాండూర్, కొడంగల్ ఆసుపత్రకి గత మూడు నెలలుగా నిధులు పూర్తిగా రావడం లేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సమావేశంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మాలతి, టిడిఆర్ ఐఎంఏ ప్రసిడెంట్ జయప్రసాద్, టీజీ ఎమ్ఈఐడీసీ ఈఈ రామ్మోహన్‌రెడ్డి, ఆర్ఎంఓలు సునీల్ రవీంద్ర, సిహెచ్‌సీ సూపరిండెంట్ చంద్రప్రియ, డిఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపాధి కల్పన అధికారి రాధిక

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన
### బయోటెక్ సంస్థల ప్రతినిధులతో భేటీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 28, ప్రభాతవార్త :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లాలోని శాంత బయోటెక్, షాహనా బయెటెక్ సంస్థలను ఆమె సందర్శించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటానికి ఆయా సంస్థలను సందర్శించినట్లు తెలిపారు. ఆయా కంపెనీల యాజమాన్యాలతో చర్చించి జిల్లాలోని నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉన్న ఉద్యోగ ఖాళీల వివకాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ఎం.రాధిక మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రధాన లక్ష్యంగా పరిశ్రమల వారిని సమన్వయం చేసుకుని ఉద్యోగాలను అందుబాటులోకి తీసుకరావటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన యువత ఉపాధి కార్యాలయాన్ని వివరాలకు సంప్రదించాలని జిల్లా అధికారి ఎం.రాధిక కోరారు.



శామీర్‌పేటలోని ఉమ్మడి మండల నాయిబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో లేబర్‌కార్డుల కోసం నమోదు పత్రాలను స్వీకరించిన రాష్ట్ర బిజెపి కార్యవర్గసభ్యులు, వైఎస్ఆర్ ట్రస్ట్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, నాయిబ్రాహ్మణుల దృశ్యం

## నాయిబ్రాహ్మణుల సంక్షేమానికి బిజెపి అండ

**శామీర్‌పేట, జులై 28, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఉమ్మడి మండల నాయిబ్రాహ్మణుల సంఘంకు సభ్యుల సంక్షేమానికి సేవలు అందించటానికి బిజెపి అండగా ఉంటుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శామీర్‌పేట ఉమ్మడి మండల నాయిబ్రాహ్మణుల సంఘ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు నమోదు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.దీనిలో బిజెపి జిల్లా రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కన్‌రెడ్డి మాలతిమాదవరెడ్డి పాల్గొన్నారు. లేబర్ కార్డు నమోదు పూర్తి చేసుకున్న లబ్దిదారులకు నమోదు పత్రాలను అతిథిల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు (వైఎస్‌రెడ్డి ట్రస్ట్) ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణు సోదరులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వి నియోగం చేసుకునేందుకు లేబర్ కార్డులు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్డుల ద్వారా కార్మికులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి అర్హుడు లేబర్ కార్డు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. లేబర్ కార్డుల కోసం నమోదు పత్రాలను అందించటానికి ముందుకు వచ్చిన వైఎస్‌రెడ్డి ట్రస్ట్ ఏనుగు సుదర్శన్‌రెడ్డికి వారు దన్యవాదాలు తెలియజేశారు. నాయిబ్రాహ్మణ సంఘానికి ప్రహరీగోడ నిర్మాణం కోసం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందని ఏనుగు సుదర్శన్‌రెడ్డి సంఘ ప్రతినిధులకు తెలియజేశారు. సంఘానికి బోరు కూడ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినందుకు వారు ఆయనకు దన్యవాదాలు తెలియజేశారు.



మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్య కార్మికులకు సబ్బులు,నూనెలు, సామాగ్రి పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న అధికారులు, సిబ్బంది, నాయకుల దృశ్యం

## మున్సిపల్ (జవాన్లకు) పబ్లిక్ హెల్త్ వర్కర్లకు సబ్బులు, నూనెలు, సామాగ్రి పంపిణీ

**శామీర్‌పేట, జులై 28, ప్రభాతవార్త:**మూడుచింతలపల్లి మున్సిపల్ (జవాన్లకు) పబ్లిక్ హెల్త్ వర్కర్లకు, పారిశుద్య కార్మికులకు సబ్బులు, నూనెలు, సామాగ్రిని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పంపిణీ చేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్లకు, జవాన్లకు,పారిశుద్య కార్మికులకు చైర్మన్ జాము రవి సబ్బులు, నూనెలు, సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్బంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న వర్కర్లకు సేవలు ఎంతో ముఖ్యమని, విలువైనవని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రత,సంక్షేమం కూడ ముఖ్యమని భావించి విధి నిర్వాహణ కోసం అవసరమైన సామాగ్రిని పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, సుభాష్, పారిశుద్య సిబ్బంది పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రతిభావంతులకు మెరిట్ అవార్డులు

..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మేడ్చల్ జిల్లాలో టెన్త్, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాదించిన విద్యార్థులకు మెరిట్ అవార్డు అందజేసిన జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,పాల్గొన్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ తదితరుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 28, ప్రభాతవార్త**

పదవతరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినిలకు మెరిట్ అవార్డులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అందజేసి అభినందించారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా టిఎంఆర్ఈఐఎస్-ఉప్పల్, మల్కాజ్‌గిరి పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దీనిలో ఆయనతో పాటు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ పాల్గొన్నారు. పాఠశాలల్లోని తరగతి గదులను, వసతి గృహాలను, భోజనశాలను, వంటశాల, మరుగుదొడ్లు, త్రాగునీరు సౌకర్యం, పరిశుభ్రత, విద్యార్తులకు కల్పించిన మౌళిక సదుపాయాలు,వసతులను ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు.

విద్యార్థుల భవిషత్ లక్ష్యాలు, ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, కష్టపడి చదవటం, సమయపాలనలు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని విద్యార్థులకు ఫైజాన్ అహ్మద్ సూచించారు. అత్యధిక మార్కులు సాదించిన వారికి మెరిట్ అవార్డులను అందజేశారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్నా భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. విద్యతో పాటు క్రీడలు కూడ విద్యార్థులకు అవసరమని ఆయన సూచించారు. నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, వికాసం, ఆత్మ విశ్వాసం క్రీడలు పెంపొందిస్తాయని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ, పాఠశాల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**ఘట్‌కేసర్, జులై 28, ప్రభాతవార్త:** సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

ఘట్‌కేసర్ డివిజన్ బుగ్గానగర్‌కు చెందిన తురుపునూరి సంధ్యకు సంబంధించి రూ.31,500లు సీఎం సహాయనిధి చెక్కును ప్రభాకర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం అందజేశారు. సంధ్య అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు అధికం కావడంతో ఆర్థిక సహకారం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి ధరఖాస్తు చేసుకోగా సీఎం ఆర్ఎఫ్ నుంచి చెక్కు రావడంతో ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల వైద్య సహాయానికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో ధైర్యాన్నిస్తుందని అన్నారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్బాస్‌అలీ (ఇమ్ము), కాంగ్రెస్ నాయకులు బొక్క సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# 'నరక'పాలక సంస్థ!

**అధికారులు హైదరాబాద్‌లో మకాం ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడు కరువు**

**ఏ రోడ్డు చూసినా గుంతల మయమే.. ప్రజాప్రతినిధులు లేక పడకేసిన పాలన**



**ఘట్‌కేసర్, జులై 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాలకు పలు చోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రజాసమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు హైదరాబాద్ నగరంలో నివాసం ఉంటూ స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ఎరుమల్లెవాగు వంతెన వద్ద, ఎదులాబాద్ రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రధాన రోడ్లతో పాటు కాలనీల రోడ్లు కూడా గతుకుల మయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సులు, లారీలు, ఆటోలతో ఘట్‌కేసర్ పట్టణంలో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. హెచ్ఆర్‌డిసిఎల్ ద్వారా చేపట్టిన వంద అడుగుల రోడ్డు అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుండటంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు రోడ్డు వెడల్పు పనులను పూర్తి స్థాయిలో చేయకుండా వెడల్పు తక్కువగా ఉన్న చోట్ల కూడా రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయడంతో వాహనాల మలుపులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హెచ్ఆర్‌డిసిఎల్ అధికారులు రోడ్డుపై పనులను పూర్తి చేయకుండా అక్కడక్కడ వదిలి వేయడంతో గుంతలు కారణంగా వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎదులాబాద్ రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీస మరమ్మత్తులు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రయాణం నరకంగా మారింది. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో ఉన్న ఘట్‌కేసర్ రోడ్ల అభివృద్దికి అధికారులు ఏలాంటి నిధులు మంజూరు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రజాసమస్యలను అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. పేరుకు ఎంఎంసి నగరపాలక సంస్థ అయినప్పటికి ప్రజా అవసరాలకు నిధులు కేటాయించకపోవడం, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంపై అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్ డివిజన్ కెవిఎల్ఆర్‌నగర్, సాయినగర్, అంబేద్కర్‌నగర్, బాలాజీనగర్, గాంధీనగర్, కొండాపూర్, ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, మాదారంలో అంతర్గత రోడ్డు గుంతలు పడి అధ్వాన్నయంగా మారాయి. అన్నోజీగూడ-ఘణాపూర్ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారైంది. ఈగతుకుల రోడ్డు వాహనదారులకు నరకప్రాయంగా మారింది. అధికారులు చూసీచూడనట్లు వ్యహరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇకనైనా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అండ

**పరిగి టౌన్ ,జులై 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తూ భూములు కోల్పోతున్న రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటుందని, వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా మార్కెట్ విలువకు అనుగుణంగా పూర్తి నష్టపరిహారం అందజేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం పరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథంతో కలిసి రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న అల్లాపూర్, గూడూరు, దొంగ ఎంకేపల్లి గ్రామాలకు చెందిన రైతులకు 66 ఎకరాల భూమికి గాను రూ.16 కోట్ల 22 లక్షల 78 వేల (రూ.16.2278 కోట్లు) నష్టపరిహార చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, రైతు సంక్షేమం అనే రెండు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు వంటి మౌలిక సదుపాయా ల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల త్యాగాన్ని గౌరవిస్తూ చట్టబద్ధంగా, పారదర్శకంగా మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి అభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛందంగా సహకరిస్తుండటం అభినందనీయమని, అలాంటి ప్రతి రైతుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా తెలంగాణలో అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు శాశ్వత ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తూనే, భూములు కోల్పోతున్న రైతుల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకొని వారికి తగిన పరిహారం అందజేస్తోందన్నారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా నష్టపరిహార చెక్కులు అందుకున్న రైతులు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథం, పరిగి ఎమ్మార్వో, దోమ ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, వైస్ చైర్మన్ రాజా బుల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, రైతులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా ఇంకుడు గుంత... ప్రతి గ్రామం జలసిరుల బాట !

**వర్షాభావానికి చెక్ పెట్టాలంటే నీటి సంరక్షణే మార్గం**

**జలసిరుల పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలి**

**: జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**

**మొయినాబాద్, జులై 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని భూగర్భ జలాలను పరిరక్షి ంచాలంటే ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పిలుపునిచ్చారు. వర్షపు నీటిని ప్రతి చుక్కను భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని, అదే భవిష్యత్ తరాలకు నీటి భద్రతకు బాట వేస్తుందని ఆమె అన్నారు.మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన వ్యవసాయ గుంటను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులు, రైతులతో కలిసి నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన జలసిరులు కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రతి గ్రామానికి ఊట గుంతలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపడితే భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో తాగునీటి, సాగునీటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు.రైతులు తమ



పొలాల్లో వ్యవసాయ గుంటలు ఏర్పాటు చేసుకుంటే వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలను రకించుకోవచ్చని, నీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు.

గ్రామపంచాయతీలు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే జలసిరుల లక్ష్యాలు సులభంగా సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల డీపీఓ సురేష్ మోహన్, మండల అభివృద్ధి అధికారి హిమబిందు, సర్పంచ్ కీసరి పద్మ సంజీవరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ హైపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 28, ప్రభాతవార్త:**

ప్రపంచ హైపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.ఆనంద్ ప్రారంభించారు. మంగళవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వారి ఆధ్వర్యంలో ప్రపంచ హైపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ మాట్లాడుతూ హైపటైటిస్ అనేది కాలేయం (లివర్) వాపునకు కారణమయ్యే తీవ్రమైన వ్యాధి అని, సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే లివర్ సిరోసిస్, లివర్ వైఫల్యం, లివర్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని అన్నారు. ప్రపంచ హైపటైటిస్ దినోత్సవం థీమ్ ప్రజల ప్రాణాలను కాపడగల ఆరోగ్యసేవలు, పరీక్షలు, చికిత్సలకు చేరువ కావడాన్ని అడ్డుకునే అవరోధాలను తొలగించాల్సిన అవసరాన్ని ఈ థీమ్ సూచిస్తుందన్నారు. దీనికి సంబంధించి డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ లావణ్యరెడ్డి, వివిధ ప్రోగ్రామ్స్ జిల్లా అధికారులు డా.శ్రీదేవి, డా.నాగరాజు, డా.శ్రీకాంత్, వైద్య సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## బాలికలను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

**అత్తాపూర్, జులై28,ప్రభాతవార్త :** కనిపించకుండా పోయిన ముగ్గురు మైనర్ బాలికల ఆచూకీని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా పసిగట్టి, వారిని సురక్షి తంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు.పోలీసులు వివరాల ప్రకారం...ఈనెల 25న ఉదయం 11:00 గంటల సమయంలో ఇంటి నుంచి ముగ్గురు మైనర్ బాలికలు వెళ్ళిపోయారని వారిలో ఒక బాలిక తల్లి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా, ఇంట్లో చిన్నచిన్న విషయాలకు తల్లిదండ్రులు తరచూ మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ ముగ్గురు మైనర్ బాలికలు ఇళ్లను వదిలి ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. పోలీసులు వెంటనే పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించగా, ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో కాటేదాన్ నుంచి వారు ఒక ఆటోలో వెళ్లినట్లు గమనించారు.దింతో రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలికల ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వే పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కాటేదాన్, బుద్వేల్, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి ప్రయాణ మార్గాన్ని స్పష్టంగా గుర్తించారు.దర్యాప్తులో భాగంగా బాలికల్లో ఒకరు రహస్యంగా తనతో పాటు తీసుకెళ్లిన మొబైల్ ఫోన్‌తో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఆధారంగా దానికి అనుసంధానమై ఉన్న మొబైల్ నంబర్‌ను సేకరించి, సాంకేతిక విశ్లేషణ ద్వారా ఆ మొబైల్ లొకేషన్‌ను సమర్థవంతంగా ట్రాక్ చేశారు.మధ్యప్రదేశ్‌లోని బీనా రైల్వే స్టేషన్ వద్ద రైలును తనిఖీ చేసి, ముగ్గురు బాలికలను సురక్షి తంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**కౌన్సెలింగ్ మరియు తల్లిదండ్రులకు అప్పగింత:**

రెస్క్యూ చేసిన బాలికలను అనంతరం హైదరాబాద్‌కు సురక్షితంగా తీసుకొచ్చి, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలు మరియు నిపుణులతో కౌన్సెలింగ్ పూర్తి చేసిన తర్వాత వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.పిల్లలతో ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా మాట్లాడాలి మరియు వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. చిన్నచిన్న విషయాలకు తీవ్రంగా మందలించడం కంటే, సమస్యలను ఓర్పు మరియు విచక్షణతో పరిష్కరించడానికి ప్రయత్నించాలి. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై తగిన పర్యవేక్షణ ఉంచాలి.ఏదైనా సమస్య ఎదురైతే ఇంటి నుంచి వెళ్లిపోవడం సరైన పరిష్కారం కాదని, కుటుంబ సభ్యులు లేదా విశ్వసనీయ వ్యక్తుల సహాయం తీసుకునేలా పిల్లల్లో ధైర్యాన్ని నింపాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

**శామీర్‌పేట, జులై 28, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మ వారి కల్యాణోత్సవం ఘనంగా కన్నుల పండుగగా జరిగింది. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మ వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. దీనిలో మున్సిపల్ చైర్మన్ జాము రవి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలో, కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలందరిని అమ్మవారు సుఖసంతోషాలతో ఉంచాలని, అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు చైర్మన్ జాము రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో ఓటర్లు తప్పకుండా పాల్గొనాలి

**అత్తాపూర్ జులై28,ప్రభాతవార్త :** ఎస్ఐఆర్‌లో ఓటర్లందరూ తప్పకుండా పాల్గొని తమ పేర్ల నమోదు చేసుకొని బిఎల్ఓలకు సహకరించాలని రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి తూర్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు.మంగళవారం హైదర్‌గూడలోని బూత్ నంబర్లు 238, 239, 240, 241 బూత్‌ల పోలింగ్ స్టేషన్ దోనాల్డ్ స్కూల్ వద్ద బిజెపి ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ సహాయ కేంద్రానికి రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్ పర్యవేక్షించినారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

## ఐఐటీ విద్యార్థినికి ఆర్థిక సాయం

**షాద్‌నగర్, జులై 28, ప్రభాతవార్త :** పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే మానవతా దృక్పథంతో పలువురు దాతలు ఓ నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత అందించారు. కమ్మదనం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన దళిత విద్యార్థిని ఆదిలక్ష్మి , వారణాసిలోని ఐఐటీలో మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సులో సీటు సాధించింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఉన్నత విద్యను కొనసాగించేందుకు దాతలు ముందుకు వచ్చారు.ఖమ్మంకు చెందిన మధు టీచర్, హన్మకొండకు చెందిన డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలోని మహా అది సేవా సమితి (మాస్) తరఫున రూ.20 వేల ఆర్థిక సహాయం అందించగా, ఇతర దాతలు మరో రూ.46 వేల సాయం అందించారు. మొత్తంగా ఆదిలక్ష్మికి రూ.66 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండల ఎంఈఓ మనోహర్ రూ.5,000, జీహెచ్‌ఎం యాదయ్య రూ.5,000, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కేసీ లక్ష్మణ్ రూ.5,000, రిటైర్డ్ వెటర్నరీ జేడీ డాక్టర్ అంజిలప్ప రూ.5,000, కావలి భాస్కర్ రూ.5,000, గంట్లవెల్లి, చిన్నరేవల్లి గ్రామ సర్పంచ్ బత్తుల వెంకట్ రాములు గౌడ్ రూ.5,000, డాక్టర్ రాఘవేందర్ రూ.5,000, పోలే శ్రీహరి రూ.3,000, జాంగారి రవి రూ.2,000, రిటైర్డ్ టీచర్ శ్యామల రూ.2,000, జర్నలిస్ట్ కేపీ రూ.2,000, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జంగయ్య రూ.2,000, టీఎన్‌జీఓ అధ్యక్షుడు జక్కుల శ్రీనివాస్ యాదవ్ రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

నిరుపేద విద్యార్థిని ఆదిలక్ష్మి ఉన్నత విద్యకు దాతల సహకారం అందేలా కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధేపల్లి సిద్దార్థను పలువురు అభినందించారు.

ఈ సందర్భంగా విద్యార్థిని ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. తన ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందించిన దాతలందరికీ, సహాయం అందేలా కృషి చేసిన బాధేపల్లి సిద్దార్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన చదువును విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఎంఈఓ మనోహర్, రిటైర్డ్ వెటర్నరీ జేడీ డాక్టర్ అంజిలప్ప, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధేపల్లి సిద్దార్థ, యువ నాయకుడు జాంగారి రవి, రిటైర్డ్ టీచర్ శ్యామల, రిటైర్డ్ కండక్టర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరిని విజయవంతం చేయండి



**శంకర్‌పల్లి, జులై 28, ప్రభాతవార్త :**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంలోప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లుతో సమావేశం ఏర్పాటు చేసి జలసిరి కార్యక్రమం గురించి పలు సూచనలు సలహాలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు వర్షపు నీటిని భూమిలోకి పంపి భూగర్భ జలాలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపివో గిరిరాజ్, ఏఈ నంద కిషోర్, ఏపీవో నాగభూషణం, ఈసీ జనార్దన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పట్నం కుటుంబానికి మాజీ మంత్రుల పరామర్శ..

**షాబాద్, జులై 28, ప్రభాతవార్త :** మాతృ యోగానికి గురైన పట్నం కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు జడ్పీ ఛైర్మన్ లు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు తన్నీరుహరీష్ రావు, పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ లు పరామర్శించారు. షాబాద్ లోని మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాను గత వారం నిమ్స్ ఆస్పత్రిలో రుక్కమ్మను పలుకరించగా ఉషారుగా మట్లాడిందని హరీష్ రావు, సవిత ఇంద్రారెడ్డిలు చెప్పారు. రుక్కమ్మ ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్,మహేష్ రెడ్డి, ధర్మ రెడ్డి అలాగే మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి,శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మహబూబ్నగర్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణ, బొంరాస్ పేట్ మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ జడ్పీ చైర్పర్సన్ బిందు, డి సి సి బి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్ కొలన్ కృష్ణ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మహిపాల్ , యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎదులాబాద్ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

-మెడిసిటి ఆసుపత్రి వైద్య శిబిరం

**ఘట్‌కేసర్, జులై 28, ప్రభాతవార్త:** ఎదులాబాద్ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయిస్తామని మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావులు అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ పాతగ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం మేడ్చల్ ఘణ్‌పూర్ మెడిసిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి, ప్రవీణ్‌రావల సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ప్రజలు ఉదయంనుంచే వైద్య పరీక్షలు, మందులకోసం బారు లుతీరారు. బీపీ, షుగర్, కంటి, ఈఎన్‌టీ, గైనకాలజీ పరీక్షలుచేసి మందుల పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ కాలుష్యం ప్రభావం తో కిడ్నీ, వంధ్యత్వ సమస్యలు వచ్చి ప్రజలు రోగాలబారిన పడ్డారని తెలిపారు. త్రాగునీటి నాణ్యత, వాయు కాలుష్యమే అనారోగ్యాలకు ప్రధాన కారణాలని వ్యవసాయ రసాయనాలు, కలుషితఆహారం ఆరోగ్యంపైతీవ్ర ప్రభావం చూపుతుందని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవా లని సూచించారు.

**CAUTION NOTICE**

The General public are hereby informed that my Client **Beejam Phani Kumar**, S/o B. Subba Reddy, Aged about 41 years, Occ: Business, R/o 3-12-98, Kumarpally, Hanmakonda, Warangal District is the absolute owner and possessor of marked as No. 21 admeasuring 300 Sq.Yards or 250.83 Sq.Meters in forming part of Survey No.11 Part, ward No.3, Block No.7 situated at Himapuri Colony, DP Nagar, Mansoorabad Village, Saroornagar Mandal, R.R. District, bounded by: NORTH: Plot No.20; SOUTH: Plot No.22; EAST: Plot No.36, WEST: 30 feet Road having purchased the same under a registered Sale Deed No.1971/2018 dated 09/04/2018 from Smt. Aravapalli Sugunanamma & others through their GPA Holders, in turn their common ancestor namely Aravapalli Venkateshwarlu purchased the above Plot under registered Sale Deed No. 1690/1982 dated 04/03/1982, since the date of purchase my Client is in peaceful possession and enjoyment of the above Property. That my Client while coming from Gajwel to Secunderabad along with one bag containing the said documents when he reached at Turkapally, Shameerpet Mandal, medchal Malkajigiri to have tea and found that the said bag along with said original documents lost by my Client on 26/07/2026.

Therefore, my Client hereby cautioned to the General Public not to make any transaction in respect of the above property through the said documents with the third parties. In-spite of this notice, if any person/s shall to do so, the same will be treated as Null and void and not binding on my Client in respect of the above Property. If any person/s traced the said document and the same may be submitted to the undersigned on humanitarian grounds for the purpose of avoiding future complications.

**Sd/- B. RAM MOHAN**
**Advocate**
H.No. 2-111, Sree Nilayam,
Aliabad Municipality, Shameerpet
Mandal, Medchal Malkajigiri District.
**Cell: 8328420199**

## వీధికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

**ఒక్కరిపరిస్థితి విషమం**



**మర్పల్లి, జులై 28, ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని మొగిలిగుండ్ల గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేసి ఐదుగురిని గాయపరచగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

గ్రామస్తుల కథనం ప్రకారం సోమవారం రాత్రి 7...8 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన పుణ్యమ్మపై కుక్కలు దాడిచేయగా కాలు,చెయ్యి, చెవుకు గాయాలు కాగా,రమేష్,కుడి కాలుకి మరో వ్యక్తితోపాటు గ్రామంలో గుడి నిర్మాణం పనులు చేస్తున్న బద్రి పెదవులను కరిచింది దానితో బద్రిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గ్రామంలో వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉదయం పూట పిల్లలను బడికి పంపాలంటే భయం భయంగా వెళ్ళవలసి వస్తుందని వారు తెలిపారు. అధికారులు నాయకులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని వారు కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**పెద్దేముల్, జులై 28, ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, ప్రజాసంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయమని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నర్సమ్మ హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్ సర్జరీ కోసం ఆమేకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో రూ.2.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసిని ఆమే కుటుంబ సభ్యులకు మంగళవారం కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డితో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, మద్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తు, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తోందని అన్నారు. సిఎం సహాయనిధి అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. లబ్దిదారులు త్వరగా కోలుకొని సాధారణ జీవితానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.శ్రావన్, యువనాయకులు ఇందూరు కుర్వ బాలు తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి మరింత బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలి



పార్టీ సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**మేడ్చల్,జులై 28, ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ఎల్లంపేట మున్సిపాలిటీలో ఎదురులేని పార్టీగా బిజెపిని నిలబెట్టేవిధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ బిజెపి కార్యకర్తలు సమావేశం మంగళవారం ఎల్లంపేటలోని సోను ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి బూత్‌లో బిజెపి పటిష్టంగా ఉండే విధంగా ప్రతి కార్యకర్త పార్టీకి కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ పూర్తిస్థాయిలో ప్రజల వైపు ఉండి కొట్లాడం కోసం ముందు వరుసలో ఉంటామని తెలిపారు. అనంతరం జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి, మాజీ ఎంపిపి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టే విదంగా పని చేస్తున్నదని అన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అహర్నిషలు దేశం కోసం పని చేసి భారత దేశ కీర్తి ప్రతిష్టతలను ప్రపంచానికి తెలిసేలా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఎనాడు ఎవరు చేయని విదంగా దేశ అభివృద్ధికి బిజెపి పని చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపేట జగన్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ పార్టీ ఇంచార్జ్ హంస కృష్ణ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్, మహేశ్వరి రాజేష్, పార్టీ ప్రధాన కార్యదర్శులు మహేష్, ప్రకాష్, మాజీ సర్పంచ్ పోచయ్య, నాయకులు సురేందర్ సింగ్, రవి నాయక్, పుష్ప మల్లారెడ్డి, రవి ముదిరాజ్, రవిబాబు, బాబు, రాజశేఖర్ రెడ్డి, భూపాల్, శాంతి జీవన్, నాగేందర్‌రెడ్డి, వెంకటేష్, చంద్రం, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ పట్టణంలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

## మేడ్చల్‌లో మురికినీటి సమస్యను పరిష్కరించాలి

**మేడ్చల్,జులై 28, ప్రభాతవార్త:** మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలు, కిష్టాపూర్ రోడ్డు, బస్ డిపో ప్రాంగణాన్ని సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్బంగా శైలజ మాట్లాడుతూ కాలనీల్లో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ కాలనీలు దుర్గంధంగా మారాయని, దుర్వాసన, దోమల బాదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపరచి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.బస్ డిపో ప్రాంగణంలో మురికి, చెత్త పెద్దఎత్తున పేరుకుపోయి ప్రయాణికులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే చెత్తను తొలగించి పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్, ఉపాధ్యక్షుడు మైసరి రాజు, కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, నాయకులు బొజ్జ వంశీ రెడ్డి, ఎన్ఎస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 3లోగా పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి

**షాద్‌నగర్, జులై 28, ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని షాద్‌నగర్ తహసీల్దార్ చెన్న నాగయ్య కోరారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.షాద్‌నగర్ రూరల్ పరిధిలో 2,294 మంది ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని, ఆయా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ సూచించారు. ఈ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 28 పోలింగ్ స్టేషన్లలో 100 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, బీఎస్పీ నాయకుడు దొడ్డి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

# లక్ష్మాపూర్ తండా గ్రామంలో ఘనంగా సీత్లా పండుగ

**శామీర్‌పేట, జులై 28, ప్రభాతవార్త:**

లక్ష్మాపూర్ తండా గ్రామంలో సీత్లా పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పాల్గొన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ తండా గ్రామంలో గిరిజనులు (లంబాడ) నిర్వహించిన సీత్లా పండుగ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో గిరిజనులతో చైర్మన్ జాము రవి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ గ్రామీణ సాంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించటం ప్రతి ఒక్కరు బాధ్యతగ భావించి పండుగలు వేడుకలుగా ఘనంగా జరుపుకోవటం, ప్రజలు అందరు ఐక్యమత్యంగా ఉండి సీత్లా పండుగను ఘనంగా నిర్వహించుకోవటం అభినందనీయమని చైర్మన్ జాము రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మణ్, హీరాలాల్, వెంకటేశ, సికిందర్, నందం, వెంకటేశ, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మాపూర్ తండా గ్రామంలో సీత్లా పండుగ వేడుకల్లో గిరిజనుల (లంబాడిల)తో కలిసి పాల్గొన్న మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి

# ప్రమాదాలకు చెక్.. బ్లాక్ స్పాట్లపై పోలీసుల ప్రత్యేక దృష్టి

**-డివిజన్‌లో ప్రమాదకర ప్రాంతాల పరిశీలన**

**- రహదారి భద్రతకు త్వరలో కీలక చర్యలు**

**కొత్తూరు, జులై 28, ప్రభాతవార్త:**





బ్లాక్ స్పాట్లను పరిశీలిస్తున్న డిసిపి యోగేష్ గౌతమ్, ఎసిపి ఎస్. లక్ష్మీనారాయణ,తదితరులు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డివిజన్ పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు)పై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణతో పాటు సంబంధిత పోలీసు అధి కారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, కాంట్రాక్టర్ సంయుక్తంగా బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా, కొత్తూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రహదారులపై హెచ్చరిక బోర్డులు, సైన్‌బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, డివైడర్ల ఏర్పాటు, రోడ్డు భద్రతా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కొత్తూరు సీఐ నర్సయ్య మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను త్వరితగతిన అమలు చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఆగస్టు 3లోగా పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి

**- తహసీల్దార్ ముంతాజ్ బేగం**

**కొత్తూరు, జులై 28, ప్రభాతవార్త:**

కొత్తూర్ మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్, డిజిటలైజేషన్ పనులను ఆగస్టు 3వ తేదీలోగా పూర్తి చేయాలని కొత్తూర్ తహసీల్దార్ ముంతాజ్ బేగం పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తూర్‌లో నిర్వహించిన అన్ని రాజకీయ పార్టీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఓటర్ల జాబితా పూర్తిస్థాయిలో ఖచ్చితత్వంతో రూపొందేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఓటరును గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైందని,



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ముంతాజ్ బేగం

ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా సహకరిస్తే నిర్ణీత గడువులో లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, కర్రోల్ల సురేందర్, చిల్కామారి నరసింహ, శివచారి, తీగపూర్ ఆంజనేయులు తదితర రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్‌ను సకాలంలో పూర్తి చేయండి

**తహసిల్దార్ రమేష్ కుమార్**

**తలకొండపల్లి, జులై28, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ఎస్ ఐ ఆర్ ను సకాలంలో పూర్తి చేయాలని తలకొండపల్లి తహసిల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలలో మిగిలిపోయిన ఓటర్ వివరాలను వెంటనే బిఎల్వోలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మండలంలో ఇప్పటికే 80 శాతం పూర్తి అయినందున మిగిలిన అన్ని గ్రామాల్లోని ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తిచేసే విధంగా బి ఎల్ఓ లకు సహకరించాలని ఆయన సూచన చేశారు. ఎన్యుమరేషన్ ఫామ్ అందజేయని వాళ్ళు గ్రామాలలోని బిఎల్ఓ లకు అందజేసే విధంగా ప్రజలకు చెప్పాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల్లో 100 పూర్తయ్యే విధంగా చూడాలని ఆయన సూచన చేశారు. ప్రతి ఓటర్ తమ ఓటర్ లిస్టు ల జాబితాలో పేరు నమోదు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## బంధువుల ఇంటికి వచ్చి తప్పిపోయిన వ్యక్తి

**తలకొండపల్లి, జులై 28, ప్రభాతవార్త:** బంధువుల ఇంటికొచ్చితప్పిపోయిన సంఘటన తల కొండపల్లి మండలం గట్టుపల్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తల కొండపల్లి ఎస్సై కే శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం శాంతినగర్ కి చెందిన మల్లికేడి సతీష్(36), తన కుటుంబంతో కలిసి ఈనెల 24 తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి అందరూ అక్కడే బస చేసినారు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా సతీష్ కనిపించలేదని, కుటుంబ సభ్యులు తెలిపారు. సతీష్ కు గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేక మతిస్థిమితం కోల్పోయాడని, రూపకల్ బంధువులను గ్రామాలకు వెతికిన ఆచూకీ లభించలేదని దీంతో అతని అన్న సాయి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

## మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తా

**షాబాద్, జులై 28, ప్రభాతవార్త:**షాబాద్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐని బీజేపీ షాబాద్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల పరిపాలనా బదిలీల్లో భాగంగా షాబాద్ పోలీస్ స్టేషన్‌కు కొత్త అధికారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, షాబాద్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.నూతన సీఐ కూడా ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని, చట్టాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ షాబాద్ మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకం

**-జిల్లా ఉద్యానవన అధికారి ఎం.ఏ. సత్తార్**

**దుద్యాల్, జులై 28, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్ మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలో రైతులు వెంకటరాములు గౌడ్, పోలేపల్లి వెంకట్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలను సందర్శించి సాగు విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, ఆయిల్ పామ్ దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. అధిక దిగుబడుల కోసం శాస్త్రీయ సాగు పద్ధతులు, సమయానుకూల ఎరువుల వినియోగం, సమర్థవంతమైన నీటి యాజమాన్యం, పంట సంరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఫార్మ్ పాండ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, బోర్‌వెల్ ద్వారా సాగు చేస్తున్న రైతులకు సంవత్సరానికి ..4,200 ప్రోత్సాహకం ఇస్తోందన్నారు. అలాగే ఎస్సీ,ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం, ఓసీ రైతులకు 70 శాతం సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. దుద్యాల్ మండలం హకీంపేట్ సమీపంలో ఏర్పాటు కానున్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీతో రైతులకు సమీపంలోనే మార్కెట్, రవాణా ఖర్చుల తగ్గింపు, సకాలంలో కొనుగోలు, మద్దతు ధర ప్రయోజనాలు లభించి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రైతులకు పిలుపునిచ్చారు.



ఆయిల్ పామ్ తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉధాన్యవన అధికారి సత్తార్

కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సురేంద్రనాథ్, ఫీల్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 100 విద్యుత్ స్థంభాలు మంజూరు చేయండి

**ఆమనగల్లు, జులై28, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీలో విద్యుత్ సమస్య పరిష్కారం కొరకు కొత్తగా విద్యుత్ స్థంభాలు అవసరం ఉందని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ మంగళవారం ఆశాఖ డీఈని కోరారు. పట్టణం వేగంగా విస్తరించడం, ప్రమాదకరంగా మారిన స్థంభాల స్థానాలలో కొత్త వాటిని ఏర్పాటు చేయడం వంటి వాటి సమస్య తీర్చడానికి కోరినట్లు చెప్పారు. కాగా ఈసమస్యను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా కందుకూరు ట్రాన్స్‌కో డీఈతో మాట్లాడారని పత్యానాయక్ తెలిపారు. ఈమేరకు కందుకూరు డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయంలో డీఈ గోపాలకృష్ణను కలుసుకుని విద్యుత్ స్థంభాల ఆవశ్యకత గురించి తెలిపినట్లు, అందుకు డీఈ సానుకూలంగా స్పందించారని పత్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పూసలి సత్యం, జగన్ ఉన్నారు.

## జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

**ఆమనగల్లు, జులై28, ప్రభాతవార్త:** మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి 7వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో జైపాల్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగంల అధ్యక్షతన జరిగిన వేడుకలకు కాంగ్రెస్‌పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీతగా సూదిని చరిత్ర సృష్టించారని కొనియాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఆయనకున్న ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు ధనుంజయ, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, నాయకులు అప్పం శ్రీను, కొండల్ రెడ్డి, నిట్ట నారాయణ, వెంకట్‌రెడ్డి, విజయ్‌నాయక్, కాలే మల్లయ్య, గోల్డ్ రామ్, పర్వతాలు, అండేకర్ రాజు, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, కండె సాయి, అబ్దుల్ కరీం, కొప్పు రాఘవేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, శ్రీధర్ నాయక్, శ్రీను నాయక్, కొప్పు శ్రీశైలం, జగన్, సుక్క వెంకటయ్య, ఉపసర్పంచ్ నాయక్, శ్రీను, కుమార్ గౌడ్, పర్వతాలు, నాజర్, గౌస్, రఫీ, శంకర్ నాయక్, అబ్దుల్ రహీం, రాంబాబు, నరేందర్, కోట రామక్రిష్ణ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు. దివంగత మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి.

## హెపటైటిస్ నివారణ ప్రజల్లో అవగాహన పెరగాలి

**రంగారెడ్డిఅర్బన్ , జులై 28:** ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల్లో హెపటైటిస్ వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ, హెపటైటిస్ అనేది కాలేయాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే వ్యాధి అని తెలిపారు. ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందితే వ్యాధిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. హెపటైటిస్-బి వ్యాక్సిన్ తీసుకోవడం, పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత తాగునీటిని వినియోగించడం, సురక్షిత రక్త మార్పిడి, శుభ్రమైన ఇంజెక్షన్ల వినియోగం వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా హెపటైటిస్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు.హెపటైటిస్ లక్షణాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని అవసరమైన వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ జ్యోతిబాయి, డాక్టర్ సమీనా, వైద్య అధికారి డాక్టర్ రేఖ ప్రజలకు హెపటైటిస్ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ చర్యలు, చికిత్స, టీకాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సమాచార కరపత్రాలు పంపిణీ చేసి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని హెపటైటిస్ నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.




## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలంగాణ మహిళ మృతి

**ఆమనగల్లు, జులై16, ప్రభాతవార్త:** అమెరికా న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన మహిళ మృతి చెందిన సంఘటన ఒకటి చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44)భర్త రామకృష్ణారెడ్డితో కలిసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే స్థిరపడ్డ దీపారెడ్డి కారులో వెళ్తూ న్యూజెర్సీలో సిగ్నల్ వద్ద ఆగగా వెనుకవైపు నుంచి మరో కారు వచ్చి బలంగా ఢీకొట్టడంతో మృతి చెందినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**షాద్‌నగర్, జులై 28, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని 16వ వార్డు క్రిస్టియన్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ విద్యుత్ శాఖ డీఈ శ్యామ్ సుందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీలో తరచూ లోవోల్టేజ్ సమస్యతో పాటు ప్రతిరోజూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలి పారు. విద్యుత్ నాణ్యతను మెరుగు పరచడంతో పాటు లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పెద్ద సామర్థం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పాత కండక్టర్ వైర్లను తొలగించి నూతన కండక్టర్ వైర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. హైవే రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు 11 కేవీ విద్యుత్ లైన్లను ఫిట్ చేయాల్సిన అవసరం ఉందని డీఈ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించిన కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్‌కు డీఈ శ్యామ్ సుందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ఎన్యూమరేషన్ పత్రాన్ని ఓటరుకు అందజేస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

## అర్హులైన ప్రతి ఓటరు పేరు ఎస్ఐఆర్‌లో నమోదు కావాలి

**మేడ్చల్, జులై 28,ప్రభాతవార్త :** అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎస్ఐఆర్‌లో నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు చూడాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి, రాయిలాపూర్, గిర్మాపూర్, కిష్టాపూర్, అత్వెల్లి గ్రామాలు, మేడ్చల్ పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీ, ఎల్లంపేట మున్సిపల్ పరిధి రాజ బొల్లారం తాండల్లో మేడ్చల్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ గజ్జల కాంతంతో కలిసి వజ్రేష్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్బంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొని బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని తెలిపారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్ల పోచంపల్లి, డివిజన్ల అధ్యక్షులు చాపరాజు, మల్లేష్ గౌడ్, సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పారదర్శకంగా ఉండడానికి సర్ కార్యక్రమం

**కందుకూరు,జులై 28,ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉంటుందని కందుకూరు తహసిల్దార్ గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండల కార్యాలయం ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్ కార్యక్రమంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామాల వారీగా సాగుతున్న సర్ కార్యక్రమం 100 శాతం పూర్తి అయ్యేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు కావాలని నకిలీ ఓటర్లు తుది జాబితాకు దూరంగా ఉంచాలనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని సూచించారు.

గ్రామాల వారీగా బిఎల్వోలు సదరు ఓటర్ వద్ద నుండి సంపూర్ణ సమాచారాన్ని సేకరించడానికి ప్రత్యేక పత్రాలను అందించి సమాచారం సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులుగా బిఎల్ఏలు తమ సహకారాన్ని అందించడం అభినందనీయమని ఈ కార్యక్రమం ముందుకు సాగించి ఆగస్టు 3 వరకు జరిగే సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన వారు ఏ ఒక్క మిస్ కాకుండా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ తో పాటు కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె రాణా ప్రతాపరెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు డి రామచంద్ర, బిజెపి నాయకులు జగదీశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా బేగరి రాజు

**మొయినాబాద్, జులై 28, ప్రభాతవార్త :** తెలంగాణ రక్షణ సేన చేవెళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజును మంగళవారం నాడు తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా బేగరి రాజు ను ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్బంగా నూతన తెలంగాణ రక్షణ సేన పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం లో ఎస్సీ జనాభా అత్యధిక ఓటర్లు కలిగిన ప్రాంతమని మూడు దశాబ్దాలు గడుస్తున్నా ఎన్ని పార్టీలు మారిన చేసింది దళితులకు చేసింది ఏమీ లేదని వారు ఎద్దేవ చేశారు కవితమ్మ గారి నాయకత్వంలో పంచజన్య విద్య, ఉపాధి, వైద్యం,వ్యవసాయం, సామాజిక న్యాయం ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ పని చేస్తుందని అన్నారు ఈ పార్టీలో అన్ని వర్గాల ప్రజలకు నాయకత్వం ఉంటుందని ఇతర పార్టీల నుండి టిఆర్ఎస్ పార్టీలో అత్యధిక శాతంలో చేరుతున్నారని గుర్తు చేశారు పార్టీ బలోపేతం కోసం కష్ట పాడి పనిచేతాను అన్ని అన్నారు నా పైన నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను ఈ అవకాశం కల్పించిన టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు యండి అన్వార్ ఖాన్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షులు మేకగూడెం బిక్షపతి,షేక్ నూర్ భాయ్,సంగరి నగేష్, ఏనుగు సంజీవ రెడ్డి,బొక్కు సురేందర్ రెడ్డి, కావలి శ్రీనివాస్ ముదిరాజ్, సంతోష్ కుమార్, బొక్కు రవీందర్ రెడ్డి, మాలని రాజు, యండి యూనిస్, చాకలి విక్రమ్, చాకలి వినోద్ కుమార్,కుమ్మరి పవన్,మల్లేష్, పక్కకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు .



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామమ్మ

## ఘనంగా జైపాల్ రెడ్డి వర్ధంతి

**తలకొండపల్లి, జులై 28, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం నాడు కేంద్ర మాజీ మంత్రి, సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సూదిని జైపాల్ రెడ్డి 7 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయ కులు పాల్గొని అతను చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైపాల్ రెడ్డి సేవలు వెలకట్టలేని వని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నుంచి కేంద్ర స్థాయిలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించారని, అవినీతికి దూరంగా మచ్చ లేని నాయకుడిగా నిలిచినట్లు ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా, రాహుల్ గాంధీ లతో పనిచేసిన విశేష అనుభవం కలిగిన వ్యక్తి జైపాల్ రెడ్డి అని ఈ సందర్భంగా వారు కొనియాడా రూ. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాములు, అంజయ్య గుప్తా రమేష్ యాదవ్, రేణు రెడ్డి, లక్ష్మీ ్మ నరసింహ రెడ్డి, రమేష్ యాదవ్, రాజేందర్ నాయక్, మిద్దె జంగయ్య, యాదయ్య గౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, రవీందర్ ,కృష్ణ ,అజీమ్ తిరుపతి తోపడాయ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతో జలసిరిని విజయవంతం చేద్దాం

**తలకొండపల్లి, జులై 28, ప్రభాతవార్త:**



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరి సహకారంతో అన్ని గ్రామాల్లో విజయవంతం చేద్దామని లింగరావుపల్లి సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని లింగ రావు పల్లి రాంపూర్, వెల్జాల్ గ్రామాల్లో జలసిరిపై ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. లింగ రావు పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణా పురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమాన్ని సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నీ నో సందర్భంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, వాటిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని నీటి నిల్వను కాపాడాలని ఆయన అన్నారు. వర్షపు నీటి ద్వారా నీటిని సంరక్షి ంచుకోవడంతోపాటు భూగర్భ జలాలను అడుగంటి పోకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీటి నిల్వ వృధా చేయకుండా నివారణ మార్గాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు. తక్కువ నీటితో జరిగే వ్యవసాయ పద్ధతులను రైతులు అధికారుల సూచనలు మేరకు పంటలు వేసుకోవాలని ఆయన అన్నారు. చిన్న స్వర్ణకారు రైతులు ఫామ్ ఫౌండ్ వాళనిర్మించుకోవాలని , రూఫ్ టాప్ రేన్ వాటర్ ఫాల్వెస్టింగ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, రాంపూర్ సర్పంచ్ వట్టేలా నిర్మల శ్రీశైలం యాదవ్, వెల్జల్ సర్పంచ్ వాన రాశి రాములమ్మ, సింగల్ పిండవ్ చైర్మన్ గట్లకేశవరెడ్డి దీప్తి సర్పంచ్ బూతుకూరు వెంకటరెడ్డి, ఉప సర్పంచులు విజయ, ఆంజనేయులు, కార్యదర్శి లు, మహేష్ , రవీందర్, వార్డు సభ్యులు భాగ్య సురేందర్ రెడ్డి శేఖర్ శివలింగం సుమన్ రాములు సాత్విక మమత తో పాటు మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### వర్షాభావ పరిస్థితులపై మెట్ట పంటలు పండించండి

వ్యవసాయ శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి

**దోమ,జులై 28 ,ప్రభాతవార్త:** ఈ సంవత్సరము వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశము ఉన్నందున రైతులు మెట్ట పంటలు పండిస్తే మేలు జరుగుతుందని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.మంగళవారం నాడు దోమ మండల కేంద్రములోని రైతు వేదిక భవనంలో రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ వాతారణంలో ఎల్‌నినో ప్రబావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నదని ఈ విషయం రైతులు గ్రహించుకోవాలని సూచించారు.తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణం పంటలు పండెకంది,జొన్న, రాగులు, మినుములు వంటి కరువును తట్టుకునే పంటలు పండించాలని రైతులకు తెలియజేశారు.నేలలో తేమను సంరక్షించే చర్యలు,మల్చింగ్, అంతరపంటలసాగు,నానోయూరియా,నానోడిఏపి వాడకం,పెంచాలని సూచించారు.రైతులకు తమ పొలాల్లోని బోరుమోటర్‌ల్లో తక్కువ ఉన్నవారు డ్రిప్,స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్దతులను పాటించాలని తెలిపారు.

అనంతరం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 100 వ ఏపిసోడ్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని రైతులు అధికారులు వీక్షించారు.ఈ కార్య క్రమములో దోమ గ్రామ సర్పంచ్ మాలిశివకుమార్‌రెడ్డి,మండల వ్యవసాయ అధికారి ప్రబాకర్‌రావు,పిఎసిఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య,ఉద్యానవన అదికారి రాంరెడ్డి,పర్గి ఎఎంసి డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి,ఏఇఓలు శ్రవణ్, హారిక ,హిమావతి,విజయలక్ష్మి,రైతులు మాలి నిరంజన్‌రెడ్డి,గొల్లమల్లేశ్,తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఫామ్‌ను నింపాల్సిందే

సర్పంచ్ గడ్డం వెంకటయ్య

**కుల్కచర్ల,జులై 28 ప్రభాతవార్త:** ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా సర్ ఫామ్‌ను నింపాల్సిందేనన్ని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామ పంచాయతీకార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ దూరం ప్రాంతాలలో ఉన్న ప్రజలు సమాయం తిసుకుని ప్రభుత్వం చేపట్టినసర్ ప్రక్రియలో పాల్గొని ఫామ్‌ను నింపి అప్పజేప్పలన్నారు. లేని ఏడాల ఓటు కట్ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంత మొగులయ్య పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, మాజి రైతు బంధు అధ్యక్షులు రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగయ్య,సినియర్ నాయకులు రమేష్, మురళికృష్ణ,మల్లేష్,కె. శ్రీనివాస్,శ్రీనువాస్,వార్డు సభ్యులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

### పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై బిజెపి ధర్మయుద్ధం

**ఘట్‌కేసర్, జులై 28, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు–మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రాగం అర్జున్ ఆధ్వర్యంలో “ఫీజుల బకాయి – బీజేపీ లడాయి“ కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని మెగా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలకు మద్దతుగా మంగళవారం విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల కన్నీళ్లపై రాజకీయాలు మానుకొని ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 40 లక్షల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# చౌదర్ పల్లిలో చినుకు పడితే చిత్తడే



చౌదర్ పల్లి ఊరు చివరలోని ప్రధాన రోడ్డుపై నిలిచి ఉన్న మురికి నీరు

**యాచారం జులై 28, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల ఊరి పొలిమేరలోనే వర్షాకాలంలో చిత్తడి చిత్తడితో గుంతల మయమైన రోడ్లు దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని తాడిపర్తి ప్రారంభంలోనే, కొత్తపెల్లి, నల్లవెల్లి, మేడిపల్లి, చౌదర్పల్లి, యాచారం నుండి నంది వనపర్తి వెళ్లే దారి మరి గుంతలమాయమై గ్రామాలలో మట్టితో పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. అటు నుండి నడవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం కోసం కోట్ల రూపాయలు వేచించిన ఆయా గ్రామాలలో అభివృద్ధి జరగకపోగా గ్రామాల పొలిమేర ప్రారంభంలోనే చాలా ఇబ్బందికరమైన రోడ్డు నిర్మాణం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులైనటువంటి అండర్ డ్రైనేజీ సిసి రోడ్ల నిర్మాణ పనులు నత్త నడక నడుస్తున్నాయని ఆరోపిస్తున్నారు. సర్పంచులు నూతనంగా పరిపాలన విధానాన్ని తెలుసుకుంటున్న సందర్భంలో నిధులు లేక ఆర్థిక ఇబ్బందులతో గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది అని దానికి తోడు కాంట్రాక్టర్లు సహకరించకపోగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ప్రాథమిక అవసరాలైన త్రాగునీరు అండర్ డ్రైనేజీ సిసి రోడ్ల ప్రమాణం జరుగుతుంది కానీ గ్రామాల ప్రధాన రోడ్లైన వాటిని మరమత్తులు చేయడంలో నూతన రోడ్లను నిర్మించడంలో సంబంధిత గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అధికారం యాచారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలో గల ఊరు ప్రారంభం నుండి ఊరి చివర వరకు నాణ్యమైన రోడ్లు నిర్మించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆదర్శంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### అంతా బురదమయం

**జిల్లేడు చౌదరిగూడెం, జులై 28, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు వద్ద వర్షం నీరు చేరి బురదమయంగా మారింది. విద్యార్థులు గేటు గుండా వెళ్లే సమయంలో బురద అంటుకోని పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాకుండా పోతున్నాయి. గేటు వద్ద వర్షం నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించకుండా ఉపాధ్యాయులు ఉండడంతో చిన్నారి విద్యార్థులు బురద దాటేందుకు సర్కస్ సీట్లు చేయాల్సి వస్తుంది. తరగతి



పాఠశాల గేటు వద్ద ఉన్న బురద

గదిలో పాఠాలు చెప్పడమే కాదు తమ పరిసరాలు ఏ విధంగా ఉన్నాయో సరిచూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. విద్యార్థులు గేటు దాటే క్రమంలో పడుతున్న ఇబ్బందులను పలువురు గమనించి ఉపాధ్యాయులు ఈ చిన్న విషయాలను గమనించకుండా ఉన్నారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటు వద్ద చేరిన బురద నీటిని తొలగించి విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గ్రామ అభివృద్ధే ధ్యేయం

**జిల్లేడు చౌదరి గూడెం,జులై 28, ప్రభాతవార్త:** గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడమే తమ ధ్యేయమని జిల్లేడు చౌదరిగుడా మండలంలోని గాలిగూడా సర్పంచ్ స్వప్న సత్యం అన్నారు. మంగళవారం గ్రామంలో వి బి జి రాంజీ కార్యక్రమంలో భాగంగా జల సిరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న ప్రతి పథకాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో ఫామ్ పాండ్, ఇంకుడు గుంతలు, చిన్న నీటి కుంటలు ఏర్పాటు చేసుకున్నందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సన్న చిన్న కారు రైతులు



సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఉప సర్పంచ్ బలరాం, వార్డు సభ్యులు శేఖర్, లక్ష ్మమ్మ, అనిత,యాదయ్య, మాజీ సర్పంచ్ యాదయ్య, మల్లేష్, వెంకట్ రాములు, నర్సింలు, రాజు, జగదీష్, తిరుపతయ్య, రవీందర్, సుగుణ,వెంకటమ్మ, పావని, రమాదేవి, సునీత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు దుబ్బాక రామచందర్

## జైల్‌భరోను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు పిలుపు

**యాచారం,జులై 28, ప్రభాతవార్త :** జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెరుమండ్ల అంజయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10 న కలెక్టర్ వద్ద జరిగే జైల్ బారో కార్యక్రమం జయప్రదం నాయకులన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగాఉ పాధి కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలు తీసు కొస్తుందని అన్నారు.ఎందరో పోరాట యోధులు ప్రాణ త్యాగాలు సాధించుకున్న దేశ స్వతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టారు అని ఆరోపించారు. ఆగస్టు 10 జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాలు కోరుతున్నార అని అన్నారు. అలిండియా కమిటీల పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రేటు వద్ద జరిగే జైల్ బరో కార్యక్రమంలో కార్మికులు వ్యవసాయ కూలీలు ప్రజలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పుష్ప , కావలి జగన్, సిఐటియు కన్వీనర్ చందు నాయక్, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాలరాజ్ ,తావునాయక్, జిల్లా నాయకులు ఎం భాషయ్య ఆంజనేయులు ఇందిరమ్మ రాములు ఎం జంగయ్య పద్మ గణేష్, కుమార్ ,సత్యం, జంగయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నీలం రాము కాంగ్రెస్ పార్టీ నాయకులు

**యాచారం, జులై 28, ప్రభాతవార్త:**
ఇటీవల అనారోగ్యంతో మరణించిన యాచారం మైసయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లిన నాయకులు కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
ఈ సందర్భంగా మైసయ్య కుటుంబానికి తక్షణ సహాయంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రూ 10,000 (పది వేల రూపాయల) నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు.
అనంతరం నాయకులు మాట్లాడుతూ..మైసయ్య మరణం వారి కుటుంబానికి తీరని లోటు కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు , మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మొతకని మంజుల, వార్డు మెంబర్లు దార దశరథ,యూసఫ్ పటాన్,సీనియర్ నాయకులు నీలం పాండు, మండలి యాదగిరి , రజాక్, ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాపాలలో విస్తృత ఓటరు సమగ్ర సవరణ

**యాచారం,జులై 28, ప్రభాతవార్త :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకొని విస్తృత ప్రచారం చేస్తూ నమోదు సవరణ చేపడుతున్నారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామంలో వార్డులలో బిఎల్ఎలు అందించిన ఫారాలను ఇల్లు ఇల్లు తిరిగి వారికి అవగాహన కల్పించి నమోదు చేయించారు. స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆదేశానుసారం



జాపాలలో ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని అన్ని బూతులలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని నమోదు సవరణ చేయిస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులందరూ సైనికుల పనిచేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చేతల సత్యం సంజీవ, పార్టీ ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల సంపత్ కుమార్, సీనియర్ నాయకులు ఆవుల జగన్,పార్టీ ఉపాధ్యక్షులు నోముల కుమార్,యాట రవి, రెడ్డిమోని జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### తాసిల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**యాచారం,జులై 28, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలలో గల ఓటర్ నమోదు సమగ్ర సవరణ 90 శాతం పూర్తికావస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటి శ్రీశైలం తెలిపారు. ఆయా గ్రామాలలో బూతుల వారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆదేశాను సంసారం పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారని తాసిల్దార్ అయ్యప్పతో సమా వేశమై ఓటర్ జాబితా విషయా లను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు తో కలిసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేస్తున్నారని త్వరలో నుటికి నూరు శాతం పూర్తయ్య అవకాశం ఉందని సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. అందుకు తాసిల్దార్ అయ్యప్ప సానుకూలంగా స్పందిస్తూ వాస్తవానికి పూర్తిస్థాయిలో పని జరుగుతుందని గడువుకు ముందే త్వరలో పూర్తి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.



తాసిల్దార్ అయ్యప్పతో యాచారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు

## కేశంపేటలో ఘనంగా జలసిరి గ్రామసభలు

**కేశంపేట, జులై 28, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట సంగెం,అల్వాల వేముల నర్వ, బైర్ఖాన్ పల్లి, కొనయిపల్లి, పల్కొని గుట్ట తండా, పాటిగడ్డ, తూర్పు గడ్డ తాండ, సుందరాపురం గ్రామాల్లో జలసిరి మరియు ఉపాధి హామీ పథకాలపై ఆయా గ్రామాల గౌరవ సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలు అత్యంత కోలాహలంగా, విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి గ్రామస్థులకు పథకాల లబ్ధిపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల ఆర్థిక బలోపేతానికి, భూగర్భ జలాల పెంపునకు జలసిరి పథకం ఎంతగానో దోహదపడుతుంది. ప్రతీ రైతు, గ్రామస్థుడు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గ్రామసభల్లో ప్రజల నుండి అందిన సూచనలు, ప్రతిపాదనలను స్వీకరించి, సకాలంలో పనులు పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ దయానంద్, ఏపీవో అజిత్, ఏపీఎం కవిత, మండల వ్యవసాయ అధికారి రామశివరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీమల రమేష్ కురుమకు బాధ్యతలు అప్పగించడంపై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న టిఆర్ఎస్ నేతలు

**కేశంపేట, జులై 28, ప్రభాతవార్త :** టిఆర్ఎస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సీమల రమేష్ కురుమా నియమితులైన సందర్భంగా మంగళవారం కేశంపేట మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు.నియోజకవర్గ బాధ్యతలను సీమల రమేష్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగన్న గౌడ్, ప్రవీణ, అర్చన, లక్ష్మీ ్మ, వెంకటేష్, విజయ్ కుమార్, సతీష్, నాగేందర్, అజయ్, సాయి, హర్ష, కార్తీక్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈర్లపల్లిలో ఘనంగా పోచమ్మకు బోనాలు

**దౌల్తాబాద్,జులై 28,ప్రభాతవార్త:**
దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో మంగళవారంరోజు గ్రామదేవత అయిన పోచమ్మకు బోనాలను సమర్పించారు. ఈర్లవల్లి గ్రామంలోని ఊరిచివర కొలువుదీరిన పోచమ్మ తల్లికి మహిళలు బోనాలను పసుపు -కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించి ఆటపాటలతో డబ్బుల చప్పుల్లతో గ్రామ వీదుల గుండా బయలుదేరి ఉరిచివర కొలువుదీరిన అమ్మవారి చెంతకు చేరుకొని తమ మొక్కులను సమర్పించారు.సకాలంలో వర్షాలు కురువాలనీ,ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనీ కోరుతూ అమ్మవారికి తమ మొక్కులను తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెలుతున్న మహిళలు



అమ్మవారి గుడిచుట్టూ బోనాలతో తిరుగుతున్న మహిళలు

### ప్రజలు శాంతి, సామరస్యంతో కలిసి జీవించాలి

..హిందు సమాజ సభ్యులు నాగారం మల్లేశం

**పెద్దేముల్, జులై 28,ప్రభాతవార్త:** అన్ని వర్గాల ప్రజలు శాంతి, సామరస్యంతో కలిసి జీవించాలని హిందు సభ్యులు నాగారం మల్లేశం ఆకాంక్షించారు. మంగళవారం తాండూరు పట్టణం లోని బసవే శ్వర మహరాజ్ దుకాణ సము దాయం నందు గల ధ్వజానికి నూతన కాషాయపు జెండాకు పూజచేసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మల్లేశం మాట్లా డుతూ కాషాయ జెండా ఆవిష్కరణ కార్య క్రమాన్ని సంస్కృతి, ధర్మం, దేశభక్తి విలువలను గుర్తుచేసే ఉద్దేశ్యంతో నిర్వహించామని అన్నారు. ముఖ్యంగా యువత దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. సమాజసేవలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందు సభ్యులు మహేష్ సింగ్ ఠాకూర్, మోహన్ సేట్, అడికి శశాంక్, ప్రశాంత్‌రామ్ సాగర్, ఊరడి నారాయణ, ప్రకాష్, అవినాష్, విజయ్, నవీన్, శ్రీశైలం, దీపక్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కాషాయపు జెండాను ఆవిష్కరిస్తున్న హిందూ సభ్యులు

## నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు దృష్టిసారించాలి

..తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, జులై 28, ప్రభాతవార్త:** ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు దృష్టిసారించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించే చర్యలు చేపట్టడంతో పాటు ట్రాన్స్‌పార్మర్లు విద్యుత్ లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. వ్యవసాయ అవసరాల కోసం రైతులకు నిర్ణిత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, ప్రజల నుంచి వచ్చే పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. రైతులు రూ.9100 ప్రభుత్వానికి చెల్లిస్తే ఒక కిలోమీటరు వరకు విద్యుత్ వైరు, స్థంభాలు, ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఈ పథకాన్ని రైతులు సద్వినీయోగం చేసుకోవాలని అన్నారు. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని 132 కేవి సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ, సూర్యనాయక్, ఏడి శంకర్‌నాయక్, ఆయా మండలాల ఏఈలు, ప్రజాప్రతినిధులు, వివిద గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**కడ్తాల్, జులై 28, ప్రభాత వార్త :** కేంద్ర మాజీ మంత్రి సుదిని జైపాల్ రెడ్డి ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి దాయకమని కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుదిని జైపాల్ రెడ్డి 7వ, వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైపాల్ రెడ్డి చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఉత్తమ పార్లమెంటుగా గౌరవించందని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి రెడ్డి, లక్పతి నాయక్, టౌన్ ప్రెసిడెంట్ మలే మల్లేష్ గౌడ్, జోహార్ లాల్ నాయక్, లక్ష ్మయ్య, జాగిర్ బాబా, మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## నిర్లక్ష్యం చేస్తే ఓటు కట్

**కుల్కచర్ల,జులై 28 ప్రభాతవార్త:** ఓటు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియ ఫారం నింపల్సిందేనన్ని లేని ఓటు కట్ అవుతుందని సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లాల్‌సింగ్ తాండ గ్రామ పంచాయతీలో స్థానిక నాయకులతో సర్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. . దూర ప్రాంతల్లో ప్రజలు ప్రభుత్వం ప్రవేశ పేట్టిన బిఎఓ ఫామ్ కచ్చితంగా నింపి అధికారి అప్పజెప్పాలన్నారు.